కనుమ వేడుకల్లో బొత్స కుటుంబీకులు

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యాశాఖా మంత్రి బొత్స సత్యనారాయణతో సహా ఆయన కుటుంబ సభ్యులు సోమవారం కనుమ వేడుకలు నిర్వహించారు. సత్య ఇంజినీరింగ్ కళాశాల వద్దగల గోశాలలో గో పూజ నిర్వహించారు. రైతులు పంటలు ఇంటికి రావడానికి గోవు పాత్ర ప్రత్యేకంగా ఉండటంతో కనుమ రోజున పూజలు చేస్తారు. అందులో భాగంగా మంత్రి కుటుంబ సభ్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

నెరవేరనున్న కల

- అందుబాటులో మరిన్ని వైద్య సేవలు
- వచ్చే ఏడాది నుంచి తరగతుల నిర్వహణకు సన్నాహాలు

శరవేగంగా మెడికల్ కాలేజి నిర్మాణం



జోరుగా సాగుతున్న మెడికల్ కాలేజి భవన నిర్మాణాలు

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

సుమారు రెండు దశాబ్ధాలుగా జిల్లా వాసులు ఎంతగానో ఎదురు చూస్తున్న మెడికల్ కాలేజీ కల నెరవేరుతోంది. ఇంకా బోధన ప్రారంభం కాకపోయినప్పటికీ కాలేజీ నిర్వహణకు అవసరమైన సదుపాయాలు ఒక్కొక్కటిగా సమకూరుతున్నాయి. బోదనా సిబ్బంది పూర్తిస్థాయిలో నియమితులయ్యారు. ఇప్పుడిప్పుడే వైద్యారోగ్య సేవలు విస్తరిస్తున్నాయి. వచ్చే ఏడాది నుంచి అండర్ పోస్టు గ్రాడ్యుయేట్ (ఎంబిబిఎస్) తరగతులు ప్రారంభంచే దిశగా అడుగులు పడుతున్నాయి. భవన నిర్మాణ పనుల శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. ఈలోపు వసతి ఇబ్బందులు లేకుండా ఆసుపత్రి ఆవరణలో తాత్కాలిక ప్రాతిపదికన చేపట్టిన భవనాలు హంగులు, రంగులతో రూపుదిద్దుకున్నాయి.

జిల్లాకు మెడికల్ కాలేజీ మంజూరైన నేపథ్యంలో అందుకు జిల్లా కేంద్రాసుపత్రిని కేటాయించిన విషయం విధితమే. ఘోషాసుపత్రి కూడా మెడికల్ కాలేజీకి అనుబంధంగానే మారింది. సుమారు ఆరు నెలల క్రితమే ఈ మేరకు విశాల సముదాయంతో కూడిన ఆసుపత్రి భవనాలను మెడికల్ కాలేజీకి అప్పగించారు. ఇక్కడ పనిచేసిన వైద్య విధాన పరిషత్ వైద్యులంతా ఆ విభాగంలో నడుస్తున్న ఏరియా ఆస్పత్రులకు, సిహెచ్‌సిలకు బదిలీ అయ్యారు. దాదాపు అదే సంఖ్యకు తగ్గట్టు బోదనా వైద్యులు నియమితులయ్యారు. ఇదే ఆసుపత్రిలో పనిచేస్తున్న సుమారు 250మంది సిబ్బంది యథాతద స్థానాల్లో కొనసాగుతున్నారు. మెడికల్ కాలేజీకి అవసరమైన సిబ్బందిని దశలవారీగా భర్తీ చేస్తున్నారు. ప్రస్తుతం అడ్మినిస్ట్రేటివ్ విభాగం కూడా ఆసుపత్రిలో కొనసాగుతోంది. డాక్టర్ పద్మలీల ప్రిన్సిపాల్‌గా వ్యవహరిస్తున్న విషయం విధితమే. ఇటీవలే అప్పలనాయుడు సూరింటిండెంట్‌గా నియమితుల య్యారు. ఘోషాసుపత్రి కూడా మెడికల్ కాలేజీకి అనుబంధంగా ఉండనుంది.

ఔట్ పేషెంట్లు పెరిగారు

జిల్లా కేంద్రాసుపత్రి మెడికల్ కాలేజీగా మారిన తరువాత వైద్య సదుపాయాలు మరింతగా పెరిగాయి. ఈనేపథ్యంలో ఔట్ పేషెంట్ల సంఖ్య 10శాతం పెరిగింది. గతంలో రోజూ 1000 నుంచి 1100మంది వచ్చేవారు. ప్రస్తుతం 1100 నుంచి 1200మంది వరకు వస్తున్నారు. ఆ మేరకు ఇన్‌పేషెంట్ల సంఖ్యకూడా పెరుగుతోంది. కరోనాను ఎదుర్కొనేందుకు మెడికల్ కాలేజీ అప్రమత్తంగా ఉంది. అవసరమైనంత ఆక్సిజన్ నిల్వలు ఉన్నాయి. లిక్విడ్ మెడికల్ ఆక్సిజన్, పిఎస్‌ఎ ప్లాంట్లు ఉన్నాయి. సుమారు 100 పడకలకు సెంట్రల్ ఆక్సిజన్ సప్లై కూడా ఉంది. మెడికల్ టీమ్స్ కూడా వేశాం.

డాక్టర్ పద్మ లీల
మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, విజయనగరం

మొత్తం ఈ రెండు చోట్ల (సర్వజనాసుపత్రి, ఘోషాసుపత్రిలో) 430బెడ్‌లు అందుబాటులో ఉన్నాయి. గతం నుంచి ఉన్న మెడిసిన్, జనరల్ సర్జరీ, పీడియాట్రిక్స్, డెంటల్, ఆర్థో తదితర విభాగాలకు తోడుగా టీచింగ్‌కు తోడ్పడే అటానమీ, ఫియాలజీ, బయోకెమిస్ట్రీ, మైక్రో బయాలజీ (పెథాలజీ), ఫ్లోరెన్సిక్ మెడిసిన్, ఎస్‌పిఎం తదితర అనుబంధ విభాగాలు అందుబాటులోకి వచ్చాయి. టీచింగ్ అండ్ నాన్ టీచింగ్ విభాగాలు కలుపుకుని మెడికల్ కాలేజీలో మొత్తం 22 విభాగాలు ఉన్నాయి. ఎనస్తీషియా విభాగంలో తప్ప మిగిలిన అన్ని విభాగాల్లోనూ తగినంతమంది వైద్యులు ఉన్నారు. లేబొరెటరీలో అదనపు సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయి. ఈనేపథ్యంలో మెడికల్ కాలేజీలో ఓపి, ఐపిల సంఖ్య పెరిగింది. కార్డియాలజీ, నెఫ్రాలజీ తదితర సూపర్ స్పెషాలిటీ విభాగాలు మాత్రం ఇంకా అందుబాటులోకి రావాల్సివుంది. కాలేజీలో తరగతులు ప్రారంభమయ్యాక అండర్ పోస్టుగ్రాడ్యూట్ తొలి బ్యాచ్ విడుదల కావాలంటే కనీసం 5ఏళ్ల సమయం పడుతుంది. ఆ తరువాతే కాలేజీలో పీజీ కోర్సులు అందుబాలోకి రానున్నాయి. ఇలా కాలేజీలో పీజీ కోర్సులు అందుబాటులో వచ్చాక మాత్రమే సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందుబాటులోకి వస్తాయని ప్రిన్సిపాల్ డాక్టర్ పద్మలీల ప్రజాశకికి తెలిపారు.

మరోవైపు గాజులరేగ పరిధిలో సుమారు 70ఎకరాల విస్తీర్ణంలో చేపట్టిన మెడికల్ కాలేజీ నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయి. ప్రభుత్వం తరపున మంత్రులు, ఉన్నతాధికారుల నుంచి నిరంతర పర్యవేక్షణ జరుగుతోంది.

కొమరాడలో నాగావళి నది ఒడ్డున ఇసుక తిన్నెలపై సందడి చేస్తున్న జనం

మిన్నంటిన సంక్రాంతి సంబరాలు

- కనుమ రోజు కళకళలాడిన పల్లెలు
- ఇసుక తెన్నులు, కొండలపై జన సందడి

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, పార్వతీపురం రూరల్

భోగి మంటలు.. బొమ్మల కొలువులు.. ముగ్గుల పోటీలు.. బసవన్న ఆటలు.. హరిదాసు కీర్తనలు.. కబడ్డీ కేకలు.. క్రికెట్ కేరింతలు.. వంటకాల ఘుమఘుమలు.. పేరంటాల సందళ్లు.. కనుమ పూజలు.. స్నేహితుల కరచాలనాలు, కౌగిలింతలు...ఇసుక తెన్నులపై ఆట పాటలు ఇవీ భోగి, సంక్రాంతి, కనుమ రోజుల్లో గ్రామాల్లో సంప్రదాయంగా కనిపించిన దృశ్యాలు. ఊళ్ల పొలిమేరల్లోని ఇసుక తిన్నెలు, మట్టిదిబ్బలు, సెలయేళ్లు, పంటపొలాల్లో యువతీ యువకులు, చిన్నారులు ఉత్సాహంగా, ఉల్లాసంగా సందడి చేశారు. హరిదాసులు హడావిడి అలనాటి సంస్కృతి సంప్రదాయాలను గుర్తుచేశాయి.

పండగ అంటేనే సరదాలు, సందళ్లు... అందులోనూ సంక్రాంతి అంటే విందు, వినోదాల ప్రాధాన్యత అంతా ఇంతా కాదు. ఉద్యోగ, వ్యాపారాల్లో భాగంగా వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా కుటుంబ సమేతంగా పుట్టిపెరిగిన ఊళ్లకుచేరి అప్యాయత అనురాగలతో కలియ తిరిగారు. ఇలా ఊళ్లకు వచ్చే స్నేహితులు, కుటుంబ సభ్యుల పలకరింపులు, పరస్పర కరచాలనంతో గ్రామాలు కళకళలా డాయి. ముచ్చటగా మూడు రోజులపాటు జరిగిన భోగి, సంక్రాంతి, కనుమ పండగలో రకరకాల పిండి వంటకాలు, కూరగాయ లతో కలగాయ కూరలు, మాంసాహారం ఆరగించడం తో పాటు సాంస్కృతిక కార్యక్రమాల్లో ప్రజలు మునిగి తేలారు. కరోనా కారణంగా రెండేళ్లగా దూర ప్రాంతాల నుంచి గ్రామాలకు రాలేనివారు ఈ సారి ఉత్సాహంంగా ఇంటిల్లపాది గ్రామాలకు చేరుకున్నారు. నిత్యం ఇళ్లల్లో టీవీలు, సెల్‌ఫోన్లకు పరిమితమైన యువతీ, యువకులు సంక్రాంతి సందర్భంగా ఆటపాటలతో సందడి చేశారు. తరించిన పోయిన పెద్దలను గుర్తు చేసుకుంటూ వారిపేరిట కొత్తబట్టలు చూపించిన దృశ్యాలు సాక్ష్యాత్కరించాయి

. యువతీ, యువతులు కొత్తబట్టలు వేసుకుని, వీధుల్లో తిరుగుతూ, స్నేహితులను పలకరించుకుని, సెల్ఫీలు దిగుతూ పండగకు కొత్తశోభను చేకూర్చారు. పార్వతీ పురం, కొమరాడ, గజపతినగరం, పాచిపెంట, తదితర అన్ని ప్రాంతాల్లోనూ, నది తీరాలు, పారమ్మ, వింజమ్మ కొండలపై ఆయా గ్రామాల ప్రజలు సందడి చేశారు. ఒకరినొకరు పలకరించుకుంటూ చేసిన సందడిలో ఆప్యాయతలు పొంగిపొర్లాయి. నర్సిపురంలో జరిగిన మెరకపండగకు పెద్దఎత్తున జనం హాజరయ్యారు. మరోవైపు కొందరు అవ్వా తాతలకు, అమ్మ నాన్నలకు టాటా చెబుతూ ఇతర ప్రాంతాల్లో ఉపాధి, ఉద్యోగాలు చేస్తున్న వారంతా ఊళ్లకు పయనమయ్యారు.

లారీ పై ఏటా రూ.10వేల భారం

- నడపలేమంటున్న యజమానులు
- పక్క రాష్ట్రాల కంటే పన్నులెక్కువ
- రోడ్ టాక్స్ పెంపుతో సంక్షోభంలో పరిశ్రమ

ప్రజాశక్తి - సాలూరు

మూలిగే నక్క మీద తాటిపండు పడ్డట్టు ఆర్థిక సంక్షోభంలో కూరుకున్న లారీ పరిశ్రమ పన్నుల బాదుడుతో కునారిల్లుతోంది. గడచిన రెండేళ్లుగా కరోనా వైరస్ విజృంభణ, లాక్‌డౌన్ వల్ల లారీ యజమానులు పీకల్లోతు కష్టాల్లో మునిగిపోయిన పరిస్థితి ఏర్పడింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నులు పెంచుకుంటూ పోతుండడంతో లారీలు నడపడం యజమానులకు కత్తిమీద సాములా తయారైంది. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం లారీలు, వ్యానులు, ఆటోలపై క్వార్టర్లీ రోడ్ టాక్స్‌ను 25శాతం పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో నాలుగు చక్రాల వాహనదారులు అయోమయంలో పడ్డారు. అసలే సంక్షోభంలో కూరుకున్న లారీ పరిశ్రమను గట్టెక్కించే ప్రయత్నాలు ప్రభుత్వం చేయకుండా పన్నులు పెంచుకుంటూ పోతుండటంతో యాజమానులు ఆందోళన చెందుతున్నారు. ఉన్న లారీలు అమ్ముకోలేక, నిర్వహణా భారం భరించలేక అప్పుల పాలవుతున్నారు. ఆరునెలల క్రితం రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్ టాక్స్‌ను దారుణంగా పెంచింది. పక్క రాష్ట్రం తమిళనాడులో గ్రీన్ టాక్స్ రూ.200 ఉంటే ఎపిలో రూ.20వేలకు పెరిగింది. ఇవే కాక లారీలకు సంబంధించిన ఫిట్ నెస్ ఫీజులు దారుణంగా పెరిగిపోవడంతో యజమానుల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. రాష్ట్రంలో విజయవాడ తర్వాత లారీలు ఎక్కువగా ఉన్న పట్టణం సాలూరు మాత్రమే. సుమారు 1500 లారీలు పట్టణంలో ఉన్నాయి. లారీల నిర్వహణకు అప్పులు చేసి కిరాయి డబ్బులు ఆశించిన స్థాయిలో

రాకపోవడంతో లారీ యజమానులు ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోతున్నారు. పక్కనున్న ఒడిశా, ఛత్తీస్గఢ్ రాష్ట్రాల కన్నా డీజిల్ ధరలు ఎపిలో ఎక్కువగా ఉన్నాయి. ఇరుగు, పొరుగు రాష్ట్రాల కంటే డీజిల్ ధర ఐదు రూపాయలు ఎక్కువగా ఇక్కడ ఉంది. దీంతో లారీ యజమానులు పక్క రాష్ట్రాల్లో డీజిల్ కొనుగోలు చేసుకునే పరిస్థితి కనిపిస్తోంది. పట్టణంలోని లారీల్లో 50శాతం వరకు పాతలారీలు వున్నాయి. వీటికి ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు చేయించడం యజమానులకు పెనుభారంగా మారింది. లారీ ఎంత పాతదైదే యజమాని అంత ఎక్కువ ఫీజు చెల్లించాల్సి వస్తోంది. పన్నుల భారం, నిర్వహణ వ్యయం పెరుగుతుండడంతో చాలామంది యజమానులు లారీలను అమ్ముకోవడానికి సిద్ధమవుతున్నారు. చేసిన అప్పుల నుంచి బయట పడలేక, లారీలు నడపలేక యజమానులు గందరగోళంలో కొట్టుమిట్టాడుతున్నారు. గత్యంతరం లేని పరిస్థితుల్లో లారీ యజమానులు పోరాటానికి సిద్ధమవుతున్నారు. లారీ యజమానుల సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు త్వరలో కార్యాచరణ కు రంగం సిద్ధం చేస్తున్నారు.

ప్రభుత్వ చర్యలతో మరింత సంక్షోభం

ఐ.నారాయణరావు
లారీ యజమానుల సంఘం కార్యదర్శి, సాలూరు

రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల 25శాతం రోడ్ ట్యాక్స్ పెంపుతో లారీ పరిశ్రమ మరింత సంక్షోభంలో కూరుకుపోనుంది. గ్రీన్ ట్యాక్స్ ని రాష్ట్ర ప్రభుత్వం భారీగా పెంచింది.తమిళనాడులో గ్రీన్ ట్యాక్స్ రూ.200 ఉంటే ఎపిలో రూ.20వేలకు ఇక్కడి ప్రభుత్వం పెంచింది. ఫిట్ నెస్ సర్టిఫికేట్ల ఫీజులు కూడా ఎక్కువగా పెరిగాయి. పక్క రాష్ట్రాల్లో కంటే డీజిల్ ధర ఇక్కడ ఐదు రూపాయలు ఎక్కువగా వుంది. ఈ సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతుంటే ఇప్పుడు రోడ్ ట్యాక్స్ పెంచడం మరింత కష్టాల్లో కూరుకుపోయే ప్రమాదం. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ త్వరలో లారీ యజమానులు పోరాటానికి సిద్ధమవుతున్నారు. దీనికి సంబంధించిన కార్యాచరణను రాష్ట్ర కమిటీ సిద్ధం చేస్తోంది.



క్యాలండర్ ఆవిష్కరిస్తున్న చినరామునాయుడు, రైతు సంఘం నాయకులు

రైతువాణి క్యాలండర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-వేపాడ

ఎపి రైతు సంఘం ముద్రించిన 2023 రైతువాణి పత్రికతో పాటు క్యాలండర్, డైరీని సంక్రాంతి సందర్భంగా సోమవారం డిసిసిబి చైర్మన్ వేచలపు వెంకట చినరామునాయుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చినరామునాయుడు మాట్లాడుతూ రైతువాణి పత్రికను లాభాపేక్ష లేకుండా రైతుల ప్రయోజనం కోసం రైతుసంఘం ఆధ్యర్యంలో నిర్వహించడం అభినందనీయమని అన్నారు. రైతువాణిలో కార్పొరేట్ వ్యవసాయ పద్ధతులే కాకుండా సాధారణ రైతు వ్యవసాయ పద్ధతులు, ప్రపంచంలో, దేశంలో రైతులు పోరాడి సాధించిన విజయాలు, వ్యవసాయ రంగంలో వచ్చిన మార్పులు, ఆదర్శరైతుల విజయాలపై వ్యాసాలు రావడం అభినందనీయమని అన్నారు. రైతువాణి మాస పత్రికను రైతులు అందరూ అందరించాలని కోరారు కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి బి.రాంబాబు, ఉపాధ్యక్షులు చల్లా జగన్‌తో పాటు ఉపసర్పంచ్ కండిపల్లి. పెద్దనాయుడు, తదితరులు పాల్గొన్నారు

బాధితులకు సరుకులు అందజేస్తున్న టిడిపి నాయకులు

అగ్ని ప్రమాద బాధితులకు వితరణ

ప్రజాశక్తి - లక్కవరపుకోట

మండలంలోని రేగ గ్రామపంచాయతీలో ఈనెల 13న జరిగిన అగ్ని ప్రమాదంలో 13 పూరిళ్లుఅగ్నికి ఆహుతై 55మంది బాధితులు కట్టు బట్టలతో మిగిలిన సంగతి తెలిసిందే. ఈనేపథ్యంలో శృంగవరపుకోట నియోజకవర్గ టిడిపి నాయకులు బాధితులను పరామర్శిం చడమే కాకుండా సుమారు రూ. లక్షా 50వేలు వెచ్చించి నెల రోజులకు సరిపడా సరుకులతో పాటు వంట పాత్రలు, దుస్తులు ఆదివారం అందజేశారు. ఎస్.కోట టిడిపి నాయకులు గొంప కృష్ణ రూ.లక్షా 50వేల లోని సగం డబ్బులు ఆర్థికంగా సాయపడగా జామి టిడిపి మండల పార్టీ ఇన్‌ఛార్జి లగుడు రవికుమార్, రెడ్డి పైడునాయుడు, కొత్తవలస మేజర్ పంచాయతీ మాజీ సర్పంచ్ గొరపల్లి రాము, బండారు పెద్దబాబు , వేపాడ టిడిపి మండల పార్టీ ఇంఛార్జి గొంప వెంకటరావు మిగిలిన సగం డబ్బులు పెట్టుకుని బాధితులకు అవసరమైన సామాగ్రిని కొనుగోలు చేశారు. ఒక్కో కుటుంబానికి 25 కేజీల చొప్పున బియ్యంతో పాటు నిత్యవసర సరుకులు, దుప్పట్లు , చీరలు , పంచెలు , వంటపాత్రలు, వంట పాత్రలు మొదలగు సామాగ్రిని ఒక్కో కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా టిడిపి నేత గొంప కృష్ణ మాట్లాడుతూ ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడమే తన లక్ష్యమన్నారు. ఈ తరహా సేవా కార్యక్రమాలు నియోజకవర్గ ప్రాంత ప్రజలకు గడిచిన 15 ఏళ్లుగా చేస్తున్నామన్నారు. ఏమైనా విపత్తుల ద్వారా నష్టపోయిన బాధితులను ఆదుకునేందుకు మండలాల వారీ టిడిపి ప్రణాళిక సిద్ధం చేసిందన్నారు. నియోజకవర్గంలో ఏ మండలానికి చెందిన వారైనా ప్రమాదవశాత్తు నష్టపోయినబాధితులను గుర్తించి ఆయా మండలాల ఇన్ఛార్జిల ఆర్థిక సాయంతో పాటు తన వంతు ఆర్థిక సాయంగా రెండింతలు ఉంటుందని పేర్కొన్నారు. టిడిపి నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉగాది నాటికి స్వగృహం

- మార్చి 22న 34,505 ఇళ్లలో గృహ ప్రవేశాలు
- కాలనీల్లో మౌలిక వసతుల కల్పన

ప్రజాశక్తి-విజయనగరం

తెలుగు సంవత్సరాది ఉగాది నాటికి, పేదల సొంతింటి కలను సాకారం చేయడానికి ప్రభుత్వం చర్యలను ముమ్మరం చేస్తోంది. మార్చి 22న జిల్లాలో 34,505 ఇళ్లలో గృహ ప్రవేశాలు నిర్వహించాలని ప్రభుత్వం లక్ష్యాన్ని నిర్ధేశించింది. వీటిలో ఇప్పటికే 18,320 ఇళ్లు పూర్తి కాగా, మరో 16,185 ఇళ్ల నిర్మాణం చకచకా జరుగుతోంది. ప్రభుత్వం ఇస్తున్న సంపూర్ణ సహకారంతో, తమ చిరకాల స్వప్నాన్ని నెరవేర్చుకొనే దిశగా లబ్దిదారులు అడుగులు వేస్తున్నారు.

పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం జిల్లాలో మొత్తం 77,205 ఇళ్లు మంజూరు చేయగా, వీటిలో 651 లేఅవుట్లలో 36,631 ఇళ్లు, 40,574 వ్యక్తిగత ఇళ్లు ఉన్నాయి. ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం మార్చి 22న మొత్తం 34,505 ఇళ్లలో సామూహిక గృహప్రవేశాలు చేసేందుకు సమాయత్త మవుతున్నారు. వీటిలో ఇప్పటికే 18,320 ఇళ్ల నిర్మాణం పూర్తి అయ్యింది. మరో 16,185 ఇళ్లు వివిధ దశల్లో ఉన్నాయి. ఇంకో రెండు నెలలు గడువు ఉండటంతో, ఇవన్నీ గడువు లోగా పూర్తి చేయడానికి లబ్దిదారులు నిర్మాణ పనుల్లో నిమగ్నమై ఉన్నారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా భావిస్తున్న జగనన్న ఇళ్ల నిర్మాణానికి, ఒక్కో ఇంటికి రూ.లక్షా,80వేలను ప్రోత్సాహకంగా ఇవ్వడంతోపాటు, డ్వాక్రా మహిళలకు అదనంగా రూ.35వేలను రుణంగా అందజేస్తోంది.

ఇసుక, ఇనుము, సిమ్మెంటు, 13 రకాల సామగ్రి సరఫరా

ప్రతీ లబ్దిదారుడికి సుమారు రూ.5 లక్షలు నుంచి రూ.6 లక్షలు విలువైన స్థలాన్ని ఉచితంగా ఇవ్వడంతోపాటుగా, 651 లే అవుట్లలో పెద్ద ఎత్తున మౌలిక సదుపాయాలను కల్పించడమే కాకుండా, ఇళ్లను ఎలాగైనా పూర్తి చేయాలన్న లక్ష్యంతో, నిర్మాణానికి కావాల్సిన ఇసుకను లేఅవుట్‌లోనే ఉచితంగా సరఫరా చేస్తున్నారు. సిమ్మెంటు, ఇనుము కూడా అక్కడే తక్కువ ధరకు అందజేస్తున్నారు. అవసరమైన వారికి సిమ్మెంటు ద్వారబంధాలు, తలుపులు, కిటికీలు, కిటికీ రెక్కలు, ఎలక్ట్రికల్ సామాన్లు, పైకప్పు రేకులు, టాయిలెట్ తలుపులు, వాటర్ స్టోరేజ్ ట్యాంకు, శానిటరీ ఐటమ్స్, సున్నం, వ్రిల్ ఆర్ట్స్ తదితర 13 రకాల సామగ్రిని తక్కువ ధరకు అందజేస్తున్నారు. ఇప్పటివరకు సుమారు 80,010 మెట్రిక్ టన్నుల ఇసుకను, 13,14,541 సిమ్మెంటు బస్తాలను, 12,81,101 కిలోల ఇనుమును లబ్దిదారులకు అందజేశారు. ఇతర 13 రకాల సామగ్రిలో 9,848 వస్తువులను లబ్దిదారుల కోరిక మేరకు అందజేశారు.

గుంకలాం లే అవుట్‌లో జరుగుతున్న నిర్మాణాలు; ఎస్.కోటలోని పుణ్యగిరి లే అవుట్‌లో జోరుగా సాగుతున్న ఇళ్ల నిర్మాణాలు

మౌలిక వసతులకు పెద్దపీట

జగనన్న కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నారు. ఇళ్ల నిర్మాణం కోసం అవసరమైన నీరు, విద్యుత్, రహదారులను తాత్కాలిక పద్దతిలో యుద్దప్రాతిపదికన నిర్మించారు. ముందుగా, ఇళ్ల నిర్మాణం చేపట్టడానికి అనుగుణంగా బోర్లు తవ్వకం, తాత్కాలిక విద్యుత్ సరఫరా కోసం స్తంభాలు ఏర్పాటు, స్థంబాలను పక్కకు జరపడం, అంతర్గత గ్రావెల్ రోడ్లు, అప్రోచ్ రోడ్ల నిర్మాణం తదితర వాటికోసం, ఒక్క గృహ నిర్మాణ శాఖ ద్వారా సుమారు రూ.162.22కోట్లు ఖర్చు చేయగా, ఇంకా విద్యుత్ శాఖ, గ్రామీణ నీటి సరఫరా, డ్వామా, మున్సిపాల్టీలు, పబ్లిక్ హెల్త్, పంచాయితీరాజ్ తదితర శాఖలు కోట్లాదిరూపాయలను ఖర్చు చేసి మౌలిక వసతులను కల్పించారు.

శాశ్వత ప్రాతిపదికన విద్యుత్ లైన్లు, వీధి దీపాలు, ఇంటింటికీ తాగునీరు, రహదారుల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధమయ్యాయి. పలు కాలనీల్లో ఇప్పటికే విద్యుత్ సదుపాయం, జలజీవన్ మిషన్ పథకం కింద ఇంటింటికీ తాగునీటి సరఫరా పనులు ప్రారంభమయ్యాయి.

జగనన్న గృహ నిర్మాణ ప్రగతి

జిల్లాలో మంజూరు చేసిన ఇళ్లు	:	77,205
651 లేఅవుట్లలో మంజూరు చేసిన ఇళ్లు	:	36,631
సొంత స్థలాల్లో మంజూరు చేసిన ఇళ్లు	:	40,574
నిర్మాణం కోసం 1,2 ఆప్షన్లు ఇచ్చిన వారు	:	67,075
నిర్మాణం కోసం 3వ ఆప్షన్ ఇచ్చిన వారు	:	10,130
ఇప్పటివరకు పూర్తి అయిన ఇళ్లు	:	18,320
ఇంకా పూర్తి చేయాల్సినవి	:	16,185
ఉగాది నాడు చేయాల్సిన గృహ ప్రవేశాలు	:	34,505

మౌలిక వసతుల కల్పనకు చేసిన ఖర్చు

నీటి సరఫరా (1075 బోర్లు కోసం)	:	రూ.46.09 కోట్లు
అప్రోచ్ రోడ్లు	:	రూ.6.59 కోట్లు
అంతర్గత రహదారులు	:	రూ.0.45కోట్లు
భూమిని చదును చేయడానికి	:	రూ.2.34కోట్లు
తాత్కాలిక షెడ్ల నిర్మాణం	:	రూ.0.06 కోట్లు
సిమ్మెంట్ గోదాములు	:	రూ.0.25కోట్లు
కల్వర్టులు, బ్రిడ్జిలు	:	రూ.0.46కోట్లు
రహదారులు	:	రూ.2.01 కోట్లు
సోలార్ విద్యుత్ దీపాలు	:	రూ.2.64 కోట్లు
విద్యుత్ సరఫరా	:	రూ.101.33 కోట్లు

ఒకచోట కలుసుకున్న 1986 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

ప్రజాశక్తి-బలిజిపేట

1986 బ్యాచ్‌కు చెందిన పదోతరగతి విద్యార్థుల అపూర్వ కలయిక స్థానిక కళింగ వైశ్య భవన్‌లో సోమవారం ఘనంగా జరిగింది. వివిధ రంగాల్లో స్థిరపడి నేడు బలిజిపేట విచ్చేసిన వారంతా కుటుంబ సభ్యులతో కలిసి పండగ చేసుకున్నారు. ఈ సందర్భంగా అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన గురువులు గంగాధరం, చిన్నంనాయుడు, వెంకటరమణ మాస్టార్లను ఘనంగా సత్కరించాఆరు. గతంలో తమతో కలిసి చదువుకొని కన్నుమూసిన తోటి స్నేహితులను, ఉపాధ్యాయులను తలుచుకొని నివాళులర్పించారు. గత ఏడాది బలిజిపేట జెడ్‌పి ఉన్నత పాఠశాలలో చదువుకొని పదో తరగతి ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు కె.రామ్మూర్తి మాస్టారి జ్ఞాపకార్థం ఆయన కుమారుడు కెవి సూర్యనారాయణ (సూర్యం) నగదు ప్రోత్సాహకంతో పాటు మెరిట్ సర్టిఫికెట్లు అందజేశారు. సింగిశెట్టి వెంకటరమణ, వి.జగన్నాథ శ్రీనివాసరావు నిర్వహణలో టి.సుధాకర్ వ్యాఖ్యాతగా వ్యవహరించారు. పిరిడి కామినాయుడు(గణేష్), వేగోటి రాములు, వి.శ్రీనివాస్, తాతా నర్సింహమూర్తి, కిల్లాడ లక్ష్మణరావు, తోట మల్లి, కె.సాయి తదితరులు పాల్గొన్నారు.



నెక్కల నాయుడు బాబును సన్మానిస్తున్న ఎంపిపి సత్యవంతుడు తదితరులు

ఘనంగా నెక్కల జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- వేపాడ

రాష్ట్ర కొప్పుల వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కల నాయుడుబాబు పుట్టిన రోజు వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈసందర్భంగా ఎంపిపి డి.సత్యవంతుడు నాయుడు బాబుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైసిపి మండల యూత్ అధ్యక్షుడు బోజంకి శ్రీను, నాయకులు తీళ్ల సతీష్, రుద్ర వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

సంక్రాంతి ఉత్సవాల్లో మాట్లాడుతున్న కడగల ఆనంద్‌కుమార్

వల్లూరు గ్రామాభివృద్ధికి మరింత కృషి
ఎయిమ్స్ అధినేత కడగల

ప్రజాశక్తి-నెల్లిమర్ల

వల్లూరు గ్రామాభివృద్ధికి మరింత కృషి చేస్తానని ఎయిమ్స్ విద్యా సంస్థల అధినేత, టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్ అన్నారు. సోమవారం వల్లూరులో సంక్రాంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఆనంద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఉత్సవాల్లో భాగంగా ఆనంద్ యువసేన గ్రామంలో పలు సాంస్కృత కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆనంద్‌కుమార్ మాట్లాడుత గ్రామాభివృద్ధికి మరింత కృషి చేస్తానని తెలిపారు. ముఖ్యంగా యువతను ప్రోత్సహించి వారికి ఉపాధి అవకాశాలు కల్పించడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. యువతరం చేతిలో గ్రామ, దేశ భవిష్యత్ ఉందని వారిని అన్ని రకాలుగా అందరూ ప్రోత్సహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సర్పంచ్ పంచాది జయలక్ష్మీ, టిడిపి నాయకులు పంచాది జగన్నాథం, ఉపాధ్యాయులు పంచాది సూర్య నారాయణ మాస్టర్, నాయకులు లెంక సన్యాసి రావు తదితరులు పాల్గొన్నారు.

పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి-నెల్లిమర్ల

పరి శుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని సారిపల్లి సర్పంచ్ రాయి పైడమ్మ పేర్కొన్నారు. సోమవారం సారిపల్లి గ్రామంలో సంక్రాంతి పండగ సందర్భంగా పారిశుధ్య కార్మికులకు సర్పంచ్ రాయి పైడమ్మ నూతన వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్థులు పరిశుభ్రత పాటించడం వల్ల సంపూర్ణ ఆరోగ్యం కలుగుతుందని అన్నారు. ముఖ్యంగా గ్రామస్తులు వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో వేయకుండా పారిశుధ్య కార్మికులకు అందించాలని సూచించారు. పంచాయతీ ద్వారా అందించిన బుట్టల్లో తడి, పొడి చెత్తలను వేర్వేరుగా వేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాయి విభీషణరావు, తదితరులు పాల్గొన్నారు.

ఓ గ్రామంలో నిర్వహిస్తున్న కోడి పందేలు; వేపాడ మండలం నీలకంఠరాజపురంలో ఎడ్ల బండిని తోలుతున్న డిసిసిబి చైర్మన్ చినరామునాయుడు

గ్రామాల్లో కనుమ సందడి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా వ్యాప్తంగా సంక్రాంతి, కనుమ సంబరాల్లో ప్రజలు మునిగితేలారు. ఊరు, వాడ, చిన్నాపెద్దా తేడా లేకుండా ఉత్సాహంగా గడిపారు. కోడి పందేలు, పేకాట శిబిరాలు ఆడుతూ ఉల్లాసంగా గడిపారు.ఆట పాటలతో ఉల్లాసంగా గడిపారు. ధర్మపురి గ్రామంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన వారంతా గాలి పటాలు ఎగురవేస్తూ సందడి చేశారు. పలుచోట్ల జరుగుతున్న కోడి పందేలు జోరుగా సాగాయి.

ఘనంగా సంక్రాంతి సంబరాలు.

వేపాడ : మండలంలోని నీలకంఠరాజపురం గ్రామంలో డిసిసిబి చైర్మన్ వేచలపు చిన రామునాయుడు ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎద్దుల బండి పై గ్రామంలో ఊరేగిస్తూ సాంప్రదాయబద్ధమైన భజన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులంతా పాల్గొన్నారు.

కృష్ణరాయుడు పేటలో కృష్ణరాయుడు స్వామి వారి తీర్థ మహోత్సవంలో భాగంగా నిర్వహించిన ఎడ్ల పరుగు పందెం పోటీలను ఎంపిపి దొగ్గ సత్యవంతుడు తిలకించారు. అనంతరం విజేతలకు బహుమతులు అందజేశారు. మండల వ్యవసాయ సలహా కమిటీ చైర్మన్ ఈర్ల సన్యాసి నాయుడు, సర్పంచ్ చెల్లుబోని ముసలి నాయుడు, మాజీ సర్పంచ్ అల్లబోని పైడిబాబు, ఉప సర్పంచ్ ఎం.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గుర్ల : కనుమ పండగను పలు గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. పిల్లలు, పెద్దలు అంతా కలిసి ఉత్సాహంగా గడిపారు. ఆటపాటలతో, వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వారంతా ఒక చోట చేరి ఆట పాటలతో సందడి చేశారు. వ్యవసాయదారులు కనుమ పండగ రోజున పశువులను పూజించారు. ఉదయం పశువులను శుభ్రంగా కడిగి పసుపు కుంకంతో బొట్టులు పెట్టి ప్రదక్షిణలు చేశారు. అనంతరం పశువులను అలంకరించారు. పలు గ్రామాల్లో కోడి పందేలు, పేకాట కొనసాగాయి. పల్లిగండ్రేడులో ముగ్గుల పోటీలు, ఆట, పాటల పోటీలు గ్రామ యువత నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు.

శ్రీరామ్మూర్తి జ్ఞాపకార్థం ఆటల పోటీలు

ప్రజాశక్తి-సీతానగరం

ప్రజా నాయకుడు రెడ్డి శ్రీరామ్మూర్తి జ్ఞాపకార్థం ఆయన స్వగ్రామం రెడ్డివానివలసలో ఆదివారం డివైఎఫ్ఐ, గ్రామ యువత, పెద్దలు ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ఆటల పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను సిపిఎం జిల్లాకార్యదర్శి రెడ్డి వేణు ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పోటీలు గ్రామంలో సమైక్యత స్ఫూర్తి నింపాయని అన్నారు. ఈ గ్రామంలో రెడ్డి శ్రీరామ్మూర్తి, రెడ్డి వేణు అప్పటి యువత 1987లో డివైఎఫ్ఐ ప్రారంభించిన ప్పటినుండి గత సంవత్సరం కరోనాతో శ్రీరామ్మూర్తి మరణించేవరకు 37ఏళ్ల పాటు ఆటల పోటీలు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఈ స్ఫూర్తిని కొనసాగించాలని ప్రస్తుత గ్రామ యువకులంతా కలిసి చర్చించుకొని ఈ ఏడాది ఆటల పోటీలు నిర్వహించి వారసత్వాన్ని కొనసాగించారని తెలిపారు. ఈసందర్భం స్లోసైక్లింగ్, క్రికెట్, చెస్, రన్నింగ్, ముగ్గుల పోటీలు, టగ్గాఫోర్ (తాడు లాగటం), డాన్స్ పోటీలు, సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించారు. రెడ్డి హరి, రెడ్డి నవీన్ ,సందీప్, తదితర 20 మంది యువకులు ముందుండి ఆటల పోటీలు నిర్వహించారు. గెలుపొందిన వారికి ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. బహుమతులను శ్రీరామ్మూర్తి సతీమణి శ్రీదేవి, గ్రామ పెద్దలు రెడ్డి తవిటినాయుడు, రెడ్డి శ్రీనివాసరావు, రాము, రమేష్ గ్రామ వైస్ ప్రెసిడెంట్ రెడ్డి లక్ష్మీనాయుడు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు రెడ్డి ఈశ్వరరావు, రైతునాయకులు రెడ్డి రవణమూర్తి, ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు రెడ్డి శంకర్రావు, యుటిఎఫ్ నాయకులు జి నిర్మల, వి.ఇందిర తదితరులు అందజేశారు. శ్రీరామ్ మూర్తి ఆశయాలని ఉద్యమ స్ఫూర్తిని ముందుకు తీసుకువెళ్లాలని వక్తలు యువతను కోరారు. భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య,రెడ్డి వానివల యూత్ కమిటీ నిర్వాహకులు రెడ్డి హరితెలిపారు.

క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న సిపిఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు

విజేతలకు నగదు బహుమతి అందజేస్తున్న సర్పంచి రాజేశ్వరి

వావిలపాడులో ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి- వేపాడ

సంక్రాంతి సందర్భంగా వావిలిపాడులో సర్పంచి బీల రాజేశ్వరి ఆధ్వర్యాన ముగ్గుల పోటీ నిర్వహించారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి సర్పంచ్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి నౌడు విజయలక్ష్మికి రూ.2116 నగదు, రెండో బహుమతి రూ.1112, మూడో బహుమతి గొల్లు అలేఖ్యకు రూ.516 నగదును అందజేశారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు బీల సతీష్, ఉప సర్పంచ్ గుర్రుపోతు వెంకటలక్ష్మి, వెంకటరావు, మిడతాన శ్రీను, బూడి వెంకటరావు, బీల దేవుడు నాయుడు, ఎం.రాజు నాయుడు, బూడి వెన్నెల, పలువురు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

-నెల్లిమర్ల :సంక్రాంతి సందర్భంగా సోమవారం భగవాన్ శ్రీ సత్య సాయి సేవా సమితి ఆధ్వర్యంలో జరజాపు పేటలో ముగ్గుల పోటీలు జరిగాయి. ముగ్గుల పోటీలు జరిగాయి. ఈ సందర్భంగా ఎవరి ఇంటి ముందు వారు సాంప్రదాయం ఉట్టిపడేలా అందంగా ముగ్గులు వేసి పోటీల్లో పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ బహుమతి కనకల దివ్య, ద్వితీయ బహుమతి బెల్లాన వర్ష తృతీయ బహుమతి పల్ల ఉదయ, కన్సోలేషన్ బహుమతులు అవనాపు నైరా, తాడుతూరి సత్యవతి, గర్భాపు స్వర్ణలత సాధించారు. వీరికి నిర్వాహకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సత్య సాయి సేవా సమితి కమిటీ సభ్యులు అదత్రాపు రామారావు, కాళ్ళ రాజశేఖర్, బుగత లక్ష్మణ రావు, సుద్దాపు పాండు, తదితరులు పాల్గొన్నారు.

ఏజెన్సీని కమ్మేసిన పొగమంచు

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

గుమ్మలక్ష్మీపురం ఏజెన్సీని పొగమంచు కమ్మేస్తోంది. ప్రతి ఏటా నవంబర్‌లో మొదలైన మంచు ప్రభావం ఫిబ్రవరి వరకు ఉంటుంది. గత వారం రోజుల నుంచి మంచు ఎక్కువగా కురవడంతో చిన్నారులు, వృద్ధులు, గర్భిణీలు తీవ్ర ఇబ్బందులకు గురై జలుబు, దగ్గుతో బాధ పడుతున్నారు. సోమవారం ఉదయం దట్టమైన పొగమంచు కారణంగా స్థానిక ఆర్‌టిసికాంప్లెక్స్ పరిసర ప్రాంతాలన్నీ మంచుతో కప్పుకున్నాయి. ఉదయం 10 గంటల వరకు మంచు ప్రభావం ఎక్కువగా కనిపించింది.

సిఐటియు ఆలిండియా మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పార్వతీపురం టౌన్

సిఐటియు ఆలిండియా 17 వ మహాసభలను జయప్రదం చేయాలని ఆ యూనియన్ జిల్లా కోశాధికారి జి వెంకటరమణ పిలుపునిచ్చారు. సోమవారం పట్టణంలో తోపుడు బళ్ళు, అటో కార్మికుల నాయకులతో కలిసి సిఐటియు ఆధ్వర్యంలో జండా ఎగరవే వేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెంగుళూరులో సిఐటియు 17వ అఖిలభారత మహాసభలు జరుగుతున్నాయని అందరూ జయప్రదం చేయాలని కోరారు. కార్మికుల సమస్యల పైనా ప్రభుత్వ విధానాల పైన చర్చించి రాబోయే మూడేళ్లలో పోరాటా రూపకల్పన చేస్తారని అన్నారు. పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం రద్దుచేసి నాలుగు లేబర్ కోడ్లుగా తీసుకువచ్చి కార్మికుల హక్కులను కాలరాస్తూ కార్పొరేట్లకు పెట్టుబడిదారులకు లాభాలు సమకూరుస్తుంది.

పలుచోట్ల పేదలకు బట్టలు పంపిణీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

సంక్రాంతిని పురస్కరించుకొని పలు గ్రామాల్లో పేదలకు బట్టలు పంపిణీ చేసి పలువురు తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. మండలంలోని దన్నాన పేటలో ప్రముఖ క్లాస్-1 కాంట్రాక్టర్ గేదెల చిన్నం నాయుడు సోమవారం తన నివాసం వద్ద పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 10ఏళ్లుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. కొత్త పేట, ఎటి అగ్రహారం, తంగబిల్లి గ్రామాల్లో దేవాలయం నిర్మాణాలకు సహకరించామన్నారు. భవిష్యత్‌లో మరిన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, తదితరులు పాల్గొన్నారు.

గజపతినగరం : సంక్రాంతి సందర్భంగా కెంగువ గ్రామంలో వైసిపి నాయకుడు లెంక శ్రీనివాసరావు ఆధ్వర్యాన పలువురు పేదలకు బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద బడుగు బలహీన వర్గాలకు తామెప్పుడూ అండగా ఉంటామన్నారు. సంక్రాంతి పండగ అందరి జీవితాల్లో వెలుగులు నింపాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కొండల సూరప్పుడు, యువ నాయకులు లెంక గణేష్, అభిమానులు గుడివాడ తిరుపతి, గుడివాడ భీముడు, గ్రామస్థులు పాల్గొన్నారు.

వేపాడ : మండలం దబ్బిరాజుపేటలో సోమవారం టిడిపి నాయకులు తాడ్డి కృష్ణ ఆధ్వర్యాన వృద్ధులకు దుస్తులు పంపిణీ చేశారు. మండల పార్టీ టిడిపి అధ్యక్షుడు గొంప వెంకటరావు అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన చేతుల మీదుగా వృద్ధులకు దుస్తులు పంపిణీ చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పదవులు, రాజకీయం శాశ్వతం కాదని, గ్రామానికి చేసిన సేవా కార్యక్రమాలు ముఖ్యమని అన్నారు. ఎల్లప్పుడూ సహాయ సహకారాలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో వైకె నాయుడు, ఎస్.కోట నియోజకవర్గం టిడిపి మహిళా అధ్యక్షురాలు గుమ్మడి భారతి, సేనాపతి గణేష్ నాయకులు జి.నాగరాజు, సేనాపతి అప్పారావు, మాజీ సర్పంచ్ సిరికి సూర్యనారాయణ. గుడివాడ, ఆతవ గ్రామ టిడిపి నాయకులు సిరికి రమణ, ఎం.అప్పలసూరి, కొట్నాన సత్యారావు, సేనాపతి అప్పారావు, నిరుద్యోగి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

తొమ్మిదేళ్లుగా పేదలకు సేవా కార్యక్రమాలు

రేగిడి : లింగాలవలస గ్రామానికి చెందిన అడపా చిరంజీవి నాయుడు తన తల్లి సీతమ్మ జ్ఞాపకార్థంగా గత తొమ్మిదేళ్లుగా సంక్రాంతి సందర్భంగా పేదలకు సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. సోమవారం 200 మంది పేద వద్దులకు, వికలాంగులకు బట్టలు పంపిణీ చేశారు. లింగాల వలస, చిన లింగాల వలస, తోకల వలస, వావిలవలస తదితర గ్రామాలకు చెందిన పేదలకు చీరలు, దుప్పట్లు, పంచెలు పంపిణీ చేశారు.

నెల్లిమర్ల : పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న గేదెల చిన్నం నాయుడు

భోగాపురం : భోగాపురం మేజర్ పంచాయతీకి చెందిన మాజీ జెడ్‌పిటిసి సభ్యులు పడాల రాజేశ్వరి, వైసిపి నాయకులు పడాల శ్రీనివాసరావు సోమవారం సుమారు వెయ్యి మంది పేదలకు దుస్తులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా గత ఎనిమిదేళ్ల నుంచి తమ కుటుంబ సభ్యులతో కలిసి పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి పడాల సత్యవతి, వెంకట్రావు పాల్గొన్నారు.

వంగర : మండలంలోని పటువర్ధనం గ్రామానికి చెందిన సామాజిక కార్యకర్త యజ్జల రామారావు తన సొంత నిధులతో ఇంటింటికీ వెళ్లి కొంతమంది వృద్ధులకు వస్త్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వృద్ధులకు ఇలా వస్త్రాలు పంపిణీ చేయడం వల్ల చాలా సంతోషంగా ఉందన్నారు.

గజపతినగరం : మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్న లెంక శ్రీనివాసరావు



వేపాడ : బట్టలు పంపిణీ చేస్తున్న ఎన్ఆర్ఐ గొంప కృష్ణ

భోగాపురం : పేదలకు బట్టలు పంపిణీ చేస్తున్న పడాల శ్రీనివాసరావు, రాజేశ్వరి

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి

పాలకొండ /వీరఘట్టం

వీరఘట్టం మండలం తూడిలో చందక పద్మావతి(46) అనే మహిళ సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెందింది. పోలీసుల అందించిన సమాచారం మేరకు ఇంట్లో ఎవరూ లేని సమయంలో పద్మావతి గన్నేరు పప్పులు తిని అపస్మార స్థితిలోకి చేరిపోగా, ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు ఆమెను పాలకొండ ఏరియా హాస్పిటల్ తరలించారు. అక్కడ చికిత్స పొందినట్లు మృతురాలి కుమారుడు చందక త్రివేది నాయుడు పోలీసులకు ఫిర్యాదులో పేర్కొన్నాడు. ఈ మేరకు వీరఘట్టం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు .

కుటుంబ సభ్యుల వేధింపులకి పద్మావతి మృతి

తమ చెల్లెలు పద్మావతిని ఆమె భర్త చందక వెంకటరమణ, మరిది శ్రీను, తోటికోడలు లక్ష్మి, కుమారుడు వేధింపుల వల్లనే మృతి చెందిందని పద్మావతి అన్నయ్యలు ఆరోపించారు ఈ మేరకు పద్మావతి అన్నయ్యలు ముగిది రాము, దేవీ వరప్రసాద్, శ్రీను, గోపి వారిపై ఫిర్యాదు చేశారు. తక్షణమే పద్మావతి భర్త వెంకటరమణ అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు

ఏరియా ఆసుపత్రి వద్ద ఆందోళన

తమ చెల్లెలు పద్మావతిని మానసిక వేధించిన తమ బావ వెంకటరమణతో పాటు వారి కుటుంబ సభ్యులు మృతికి ప్రేరేపించారని ఏరియా ఆసుపత్రి వద్ద ఆందోళన చేశారు. సమగ్ర దర్యాప్తు చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని నిరసన తెలిపారు. విషయం తెలుసుకున్న పాలకొండ సిఐ మురళీధర్, వీరఘట్టం ఎస్సై హరికృష్ణ పద్మావతి కుటుంబ సభ్యులను శాంతంపజేసి పోస్టుమార్టం పూర్తయ్యల చర్యలు చేపట్టారు

పండగవేళ విషాదం

భామిని :మండలంలోని సోలికిరిలో పండగ పూట విషాదం నెలకొంది. ఈ గ్రామ పరిధిలోని వంశధార నదికి స్నానానికి నలుగురు యువకులు వెళ్లారు. వీరిలో ఎర్ర పురుషోత్తం (26) నదిలో నీటి లోతు ఎక్కువగా ఉన్న ప్రాంతంలో ఒడ్డు నుంచి జారిపడి మృతి చెందిన సంఘటన సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నా యి. హైదరాబాద్లోని బిఎన్ రెడ్డి కాలనీ, చర్లపల్లిలో ఉంటున్న ఎర్ర పురుషోత్తం (26) వత్తిరీత్యా స్నేహితుడైన రౌతు జగదీశ్ స్వగ్రామమైన బాలేరుకు సంక్రాతిని సరదాగా గడుపుదామని వచ్చాడు. సోమవారం ఉదయం పురుషోత్తంతో పాటు జగదీష్, రౌతు ఢిల్లీ, కోయబత్తురు నుంచి సంక్రాంతికి వచ్చిన గిరి సోలికిరి సమీపంలో వంశధార నదికి స్నానానికి వెళ్లారు. నది ఒడ్డున స్నానం చేసే క్రమంలో పురుషోత్తం నదిలో 15 అడుగుల లోతుగా ప్రాంతంలో పడిపోవటంతో చనిపోయాడు. పురుషోత్తం స్వగ్రామం కవిటి మండలంలోని కొత్త పుట్టుగ గ్రామం. బత్తిలి ఎస్ ఐ అమ్మన్నారావు తెలిపారు. పండగ వేళ స్నేహితుడ్ని కోల్పోడంతో మిగిలిన వారు బోరు విలపిస్తున్నారు.

నేరాలు ఘోరాలు

డివైడర్ ఢీకొట్టి యువకుడు మృతి

పార్వతీపురం టౌన్ :. స్నేహితునితో కలసి మోటార్ సైకిల్ పై వెళ్తుండగా ఆదివారంజరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. పార్వతీపురం పట్టణ ఎస్ఐ ఫక్రుద్దీన్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి గరుగుబిల్లి కి చెందిన వావిలపల్లి గౌరి శంకర్రావు గరుగుబిల్లిలో వాలంటీర్ గా పనిచేస్తున్నాడు. తన స్నేహితుడు చిట్టి రఘువర్మ (24) హైదరాబాద్ లోని ఫార్మా కంపెనీలో పనిచేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు గ్రామానికి వచ్చాడు. స్నేహితులిద్దరూ కలిసి మోటార్ సైకిల్ పై పార్వతీపురం వచ్చి తిరిగి ఇంటికి వెళ్తుండగా రైల్వే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై రోడ్డు పక్క ఫుట్ పాత్‌ను ఢీకొని పడిపోవడంతో అక్కడ ఉన్న పూలకుండీ రఘు తలకు తగిలి తీవ్ర గాయాలయ్యాయి. గౌరీ శంకర్రావుకు తీవ్ర గాయాలయ్యాయి. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. గమనించిన స్థానికులు వెంటనే 108 ద్వారా పార్వతీపురం జిల్లా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు చికిత్స అందించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కొద్దిసేపటికే రఘు మృతి చెందాడు. గౌరీశంకర్రావు పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం నిమిత్తం విశాఖపట్నం రిఫర్ చేశారు. రఘు మృతదేహాన్ని పార్వతీపురం జిల్లా ఆసుపత్రి మార్చ్యురీకి తరలించారు. సోమవారం పోస్టుమార్టం నిర్వహించి మృతదేహాన్ని కుటుంబీకులకు అందచేశారు. పట్టణ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఎస్ఐ ఫక్రుద్దీన్ తెలిపారు.

రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

పార్వతీపురంరూరల్ : పార్వతీపురం, కొమరాడ మండలం శివిని మధ్య రైల్వేట్రాక్‌పై రైలు ఢీకొని గుర్తు తెలియని, వ్యక్తి మృతి చెందాడు. మృతుడికి సుమారు 33ఏళ్ల వయస్సు ఉండొచ్చునని జిఆర్‌పి పోలీసులు అంచనా వేస్తున్నారు. మృతుడు నీలిరంగు ప్యాంటు ధరించాడు. జీఆర్పి హెచ్‌సి రత్నకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నోటీసు

మహారాజశ్రీ గణపతినగరం జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో

I.A.No.116/2012 O.S.No. 46/2022

గురుగుబిల్లి గౌరిశంకరరావు ... పిటిషనరు

బండారు కన్నంనాయుడు ... రెస్పాండెంటు

టు:
బండారు కన్నంనాయుడు,
తండ్రి లేటు అప్పలస్వామి,
సా॥ ఇద్దనవలస, మెంటాడ మండలం,
విజయనగరం జిల్లా.

పై దావాలో పిటిషను షెడ్యూలు దాఖలా ఆర్.సి.సి. శ్లాబు యిల్లు, మరియు పల్లం, మెట్టు భూములను ప్రథమజప్తు కోరుచూ పిటిషను దాఖలు చేసినందున యిందు విషయమై నీకు ఆక్షేపణలున్న తే: 19-01-2023దిన ఉదయం 10-30 గంటలకు ఖుద్దునకు గాని వకీలు ద్వారా గాని పై కోర్టులో హాజరై మనవి చేసుకోవలసినది లేనియెడల సదరు విషయమై నీ పరోక్షమున విచారించి తీర్మానము చేయుదురు అని యీ ప్రకటన ద్వారా తెలియజేయడమైనది.

రెడ్డి శ్రీనివాసనాయుడు
అడ్వకేట్, గజపతినగరం,
విజయనగరం జిల్లా.
Date: 16-01-23

NO.3. Order 5 RULE 3
SUMMONS TO APPEAR IN PERSON IN THE HONOURABLE COURT OF THE JUNIOUR CIVIL JUDGE AT GAJAPATIIINAGARAM
O.S. 46/2022

Between:
Gurugubilli Gowri Shankara Rao. ... Plaintiff

And:
Bandaru Kannam Naidu ... Defendant.

To,
Bandaru Kannam Naidu,
S/o. Late Appalaswamy, Hindu,
R/o Iddana Valasa Village,
Mentada Mandalm,
Vizianagram District.

Whereas you the plaintiff has instituted a suit against you for recovery of suit amount, you are hereby summoned to appear in this court in person on **19th day of January 2023 at 10-30 (A.M.)** hours to answer the claim, and further you hereby directed to file within 30 days of service of summon a written statement of your defense and you are directed to produce on that day all documents upon which you intend to rely in supporting of your defense.

Take notice that in default of your appearance on the day before mentioned, the suit will be heard and determined in your absence.

REDDY SRINIVASA NAIDU,
Advocate.
Gajapthinagaram.
Gajapathinagaram,
Date: 16-01-23